




# కరపత్రం

SINCE 2014

ఆదివారం జనవరి 26 2025 | సంపుటి :0 | సంచిక : 105 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# నిజమైన లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు

## నేటి నుంచే ఆ నాలుగు పథకాలకు శ్రీకారం

- గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్దిదారుల ఎంపిక
- అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు..అనర్హులకు చోటు దక్కొద్దు
- పథకాల అమలుపై అధికారులు, మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష
- గ్రామానికో అధికారి చొప్పున పథకాల అమలుకు ఆదేశాలు





హైదరాబాద్,గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్దిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ది చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలను తెలంగాణ సర్కార్ లాంఛనంగా ప్రారంభించనుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నాలుగు పథకాలకు ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పున గ్రామానికి నలుగురు మండలస్థాయి అధికారులను నియమించాలని తెలిపింది. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రంలోని మిగతా గ్రామాల్లో లబ్దిదారులకు పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మార్చి 31 లోపు నాలుగు పథకాలు వంద శాతం అమలు జరిగేలా చూడాలి.. నిజమైన లబ్దిదారులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగొద్దు.. అనర్హులకు లబ్ది చేకూరిస్తే అధికారులపై చర్యలు తప్పవని సర్కార్ హెచ్చరించింది. సంక్షేమ పథకాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల వెరిఫికేషన్ కోసం గ్రామసభలు నిర్వహించామని, ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి పథకాల ప్రారంభిస్తామన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన గణతంత్ర దినోత్సవం రోజున ఇచ్చిన మాట ప్రకారం నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నామన్నారు.

## తెలంగాణ హైకోర్టులో నలుగురు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం





- తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు.
- జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు.

## భారత సంస్కృతిలోని సమరసత మన రాజ్యాంగానికి సొగసులద్దింది.

**మన దేశానికి సహజ లక్షణం సహనం.**

**ఆ సహనం ఇప్పుడు పరిహాసానికి లోనవుతున్నది.**




గన్ పట్టడం గణ తంత్ర హక్కు అనే ప్రచారం జరిగింది.భారత గణ తంత్రం చులకన చెయ్యబడకూడదు.అలా చులకన చేసే వారికి చురకలు అంటించే అధికారం మన రాజ్యాంగ రచయితలు కల్పించారు. మన భారత చట్టాలు ఆ వెసులుబాటు మన రాజ్యాంగం కల్పించింది.ఆ నిక్కచ్చి తనాన్ని, దృఢ సంకల్పాన్ని మన పాలకులు తమ పాలనలో చూపించాలి.భారత రాజ్యాంగం అన్నింటి కంటే గొప్పది.గన్నులు,పిచ్చి పెన్నులు సృష్టించే అరాచకాన్ని త్రుంచి వేయాల్సిందే.గన్ తంత్రాన్ని, భారత రాజ్యాంగం ముగిస్తుంది.మత మౌఢ్యం,కుల పిచ్చి, జాతి వ్యతిరేక ప్రాంతీయ వాదాలు, విభజన వాదాలు, అన్ని రకాల దేశ వ్యతిరేక శక్తులను భారత రాజ్యాంగం జయిస్తుంది.జయించి తీరాలి. గణతంత్ర భారత్ వర్ధిల్లాలి.

# ప్రతి అవినీతి వెనకగా గంగుల హస్తం

- ఆయన ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు
- కరీంనగర్ మేయర్ సునీల్ రావు సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్, కరీంనగర్ భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌పై కరీంనగర్ మేయర్ సునీల్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో భాజపాలో చేరిన అనంతరం సునీల్ రావు మాట్లాడారు. 'తెదేపా నుంచి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ గంగుల కమలాకర్ ఆర్థిక పరిస్థితి ఏంటి? టెండర్ల తర్వాత కమీషన్లు ముడితే చాలు.. ఆ తర్వాత గంగుల కనిపించరు. ఆ పనుల గురించి అసలు పట్టించుకోరు. కరీంనగర్‌లో జరిగిన ప్రతి కుంభకోణం వెనక ఆయన పాత్ర ఉంది.

తరువాయి పేజి 2లో

## వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు?: కాళేశ్వరం కమిషన్

- ప్రాజెక్టుల పనులు ప్రారంభించేముందు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలపై లేదా అని కాళేశ్వరం విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు.




# కేంద్రం నిధులిస్తోంది..మోడీ ఫోటో పెట్టాల్సిందే

- ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు
- రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక



కరీంనగర్,ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఫొటోలు పెడితే రేషన్ కార్డులు ఇవ్వబోమన్నారు. తామే ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్ మీద ఆయన విమర్శలు గుప్పించారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. 'ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపానని అన్నారు.

తరువాయి పేజి 2లో

## ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు కేంద్రం అవార్డులు




ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు కేంద్రం పతకాలు ప్రకటించింది. రిపబ్లిక్ డే సందర్భంగా పతకాలు కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందించనున్నది. హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ అదనపు సీవీ విక్రమ్‌సింగ్, ఎస్పీ మాణిక్యరాజ్‌కు ప్రెసిడెంట్ మెడల్స్‌ను కేంద్రం ప్రకటించింది. మరో 12 మందికి విశిష్ట సేవా పతకాలు ప్రకటించింది. ఐజీ కార్తికేయ, ఎస్పీలు ముత్యంరెడ్డి, రామ్‌కుమార్, ఫజ్లుర్, డీఎస్పీలు వెంకటరమణ, వేణుగోపాల్, ఏఎస్‌ఐలు రణ్‌వీర్‌సింగ్, ఠాకూర్, జోసెఫ్, మొయినుల్లాఖాన్, సీఐ నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుల్ పాత్యనాయక్, ఆయూబ్‌కు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక చేసింది. ముగ్గురు అగ్నిమాపక అధికారులు, నలుగురు హోంగార్డులకు సైతం పతకాలకు ఎంపికయ్యారు.

## దావోస్ పర్యటనపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు.. సీఎం రేవంత్‌ను ఉద్దేశించేనా..?



హైదరాబాద్ : దావోస్ పర్యటన ముగించుకుని అమరావతికి వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు.. ఇవాళ రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పర్యటన అంశాలు, పెట్టుబడుల వివరాలను చంద్రబాబు వివరించారు. ఈ క్రమంలోనే ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అవేంటంటే.. 'దావోస్ అంటే అందరికి ఒక భ్రమ ఉంది. ఎన్ని ఎంవోయూలు చేశారు..? ఎంత డబ్బులు వచ్చాయి..? ఇది ఒక భ్రమ. అంటే ఇన్ ది సెన్స్.. ఇక్కడ ఉండే ఎంవోయూలు అక్కడ పోయి చేసుకోవాల్సిన పని లేదు. దావోస్ ఈజ్ ప్లేస్ ఫర్ నెట్ వర్కింగ్' అని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

చంద్రబాబు నాయుడు చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని దృష్టిలో ఉంచుకునే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యంగ్యాస్త్రాలు సంధించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు, నెటిజన్లు పేర్కొంటున్నారు. రేవంత్ పరిపాలనను హేళన చేసే విధంగా చంద్రబాబు సెటైర్లు వేశారని నెటిజన్లు గుసగుసలాడుకుంటున్నారు.

ఎందుకంటే.. దావోస్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పందం చేసుకున్న మూడు కంపెనీలూ హైదరాబాద్‌కు చెందినవే. మన రాష్ట్ర రాజధానిలో కొలువైన కంపెనీలే.. మన రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయన్నమాట. అదీ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో. ఆయా కంపెనీల ప్రధాన కార్యాయాల నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయంలో చేసుకోవాల్సిన ఒప్పందాలు.. ఏడువేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దావోస్‌లో ఎందుకు జరిగాయని సోషల్‌మీడియాలో ప్రశ్నలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దావోస్ పర్యటనలో భారీగా పెట్టుబడులు సాధించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాపత్రయపడుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కే చెందిన కంపెనీలతో స్విట్జర్లాండ్‌లో ఎంవోయూలు చేసుకున్నారని విమర్శలు గుప్పించారు. వాస్తవానికి డబ్ల్యూఈఎఫ్ వేదికగా తెలంగాణలో ఉన్న అవకాశాలను దేశ, విదేశీ కంపెనీలకు పరిచయం చేసి, చర్చలు జరిపి, పెట్టుబడులు సాధించాల్సి ఉంటుంది. భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ కంపెనీలను తెలంగాణకు ఆకర్షించేలా ప్రజంటేషన్ ఇవ్వాలి. అలాంటిది హైదరాబాదీ కంపెనీలకు కొత్తగా తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. ఈ తతంగం మొత్తం ఇక్కడే పూర్తి చేయొచ్చని, కేవలం సొంత ప్రచారం కోసమే డబ్ల్యూఈఎఫ్‌ను వేదికగా చేసుకున్నారని ఆరోపించారు. మేఘా రూ.15వేల కోట్లు, కంట్రోల్ ఎస్ సంస్థ రూ.10 వేల కోట్లు, స్కైరూట్ రూ.500 కోట్లు.. మొత్తంగా మూడు కంపెనీలు కలిపి రూ.25,500 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ ఎంవోయూలను దృష్టిలో ఉంచుకునే ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించి ఉంటారని విశ్లేషకులు, ఐటీ ఉద్యోగులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరి ఇంత ఘోరంగా పరువు తీసుకుంటారా..? అని రేవంత్ రెడ్డిపై మండిపడుతున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరిపాలనలో మార్పులు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మనపై సెటైర్లు వేయడమంటే.. రేవంత్ రెడ్డి పాలన ఏంటో తెలిసిపోతోందని.. ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ నవ్వుల పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర పౌరులు.

## గంగాజల భద్రత.. అల్లుడి బాధ్యత!

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా దేవుడికి జాతర సందర్భంగా గంగాజలంతో అభిషేకం చేయడం ఆనవాయితీ. ఈ నెల 28న జాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో గోదావరిలోని గంగాజలాన్ని తీసుకురావడానికి మెస్రం వంశస్థులు 10వ తేదీన మంచిర్యాల జిల్లా జన్నారానికి వెళ్లి శుక్రవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. గంగాజలాన్ని తీసుకొచ్చిన కలశాన్ని నేలపై పెట్టకుండా మహాపూజలు అయ్యే వరకు చెట్టుపై ఉంచుతారు. మెస్రం వంశస్థుల అల్లుడే దీన్ని భద్రపరుస్తుంటారు. ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి దేవత ఆలయ సమీపంలోని మర్రి చెట్టుపై గంగాజల కలశాన్ని మెస్రం వంశస్థుల అల్లుడు దేవురావు భద్రపరుస్తున్న చిత్రమిది.

# నిజమైన లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు

మొదటిపేజీ తరువాయి

మండలానికి ఒక గ్రామం యూనిట్‌గా తీసుకొని నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి పథకాలు అందిస్తామని, మార్చి వరకు పక్రియ పూర్తి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. పథకాల్లో ఎలాంటి సీలింగ్ లేదని, అర్హులందరికీ అందిస్తామన్నారు. ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికి రైతు భరోసా ఇస్తామని భట్టి వివరించారు. నాలుగు కొత్త పథకాలు ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించామని చెప్పారు. గ్రామాల్లో పథకాల కోసం లక్షల అప్లికేషన్లు వచ్చాయన్నారు. నవరి 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తామని చెప్పారు. వ్యవయసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తామన్నారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు మంత్రి ఉత్తమ్. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. ఒక్కో వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేపు నాలుగు సంక్షేమ పథకాలు మండలంలోని ఒక గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ.. గతంలో దరఖాస్తు ఇచ్చినా, సర్వేలో వివరాలు ఇచ్చినా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోక పోయినా ఇప్పుడు ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వండని అన్నారు. బీపీఎల్ కుటుంబాలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. గత పదేళ్ళుగా దొడ్డు బియ్యం ఇచ్చారు.. మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపై బయట ఆహార పదార్థాలు కొనుక్కోవాల్సి ఉండదని అనుకుంటున్నానన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారతదేశంలో రికార్డు స్థాయిలో పంటలు పండించింది తెలంగాణ రైతాంగం అని అన్నారు. దేశంలోనే రూ.7525 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. 21వేల కోట్ల రైతు రుణమాఫీ, 3వేల కోట్ల రైతు భీమా కట్టామని తెలిపారు. రేపట్నుంచి రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానాన్ని రైతు భరోసా అమలు చేయబోతున్నా మని అన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికీ రైతు భరోసా ఇస్తున్నాం.. 40 వేల కోట్లు ఒక్క సంవత్సరంలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు?: కాళేశ్వరం కమిషన్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ప్రాజెక్టుల పనులు ప్రారంభించేముందు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలపై లేదా అని కాళేశ్వరం విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని అడగాలని.. ముందే జాగ్రత్తలు తీసుకొని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లికార్జునరావు, శేఖర్ దాస్ ..కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై వారిని ప్రశ్నించారు. బ్యారేజీ ప్రతిపాదిత లోకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గం కూడా లేకపోవడంతో ఏడాది పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసేటప్పుడు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని.. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించింది. వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునేవాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదలశాఖతో సంప్రదింపులు జరిపినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సల్టెన్సీతో అధ్యయనం చేయించామని.. ఆ సిఫార్సులపై నీటిపారుదల శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదని, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్లు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్ ముందు తెలిపారు.

## కల్యాణలక్ష్మి పథకాన్ని.. వడ్డీ వసూలు స్కీంగా మార్చడానికి సిగ్గులేదా..? రేవంత్‌ను నిలదీసిన కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కల్యాణలక్ష్మి పథకం కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతోంది. క్రాప్ లోన్ కింద కల్యాణలక్ష్మి సొమ్మును జమ చేశారు. ఇలా పాత బాకీల కింద బ్యాంకు అధికారులు కల్యాణసొమ్మును జమ చేస్తుండడంతో ఆడబిడ్డల తల్లులు బోరుమంటున్నారు. ఇదేం ప్రభుత్వం అంటూ.. కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి మా ఉసురు తప్పక తగులతదని శాపనార్థాలు పెడుతున్నారు.

క్రాప్ లోన్ కింద కల్యాణలక్ష్మి నగదును జమ చేసుకున్న ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆడబిడ్డ పెళ్లి చెయ్యడం కష్టం కావొద్దని.. కేసీఆర్ తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి పథకాన్ని.. వడ్డీ వసూలు స్కీంగా మార్చడానికి సిగ్గులేదా? అంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. వచ్చిన కల్యాణలక్ష్మి లక్ష రూపాయలలో 60 వేలు బ్యాంకుకి%ా%.40 వేలు లబ్ధిదారునికా? అని ప్రశ్నించారు. నువ్వు నడిపేది ప్రభుత్వమా? రికవరీ ఏజెన్సీనా? అందరికీ రెండు లక్షల పంట రుణ మాఫీ చేశామని బాకాలు కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి.. సోంబాయి కన్నీటికి కారణం ఎవరు అని! తనకు రావాల్సిన కల్యాణలక్ష్మి డబ్బులులో 60 వేలు ఎందుకు గుంజుకున్నారు అని! తులం బంగారం అన్నారు, ఆఖరికి కల్యాణలక్ష్మి డబ్బులులో కూడా కొర్రీలు పెడుతున్నారు! దందాలు%ా%వసూళ్లు మాత్రమే తెలిసిన రేవంత్‌కి ఒక చిన్న సలహా! కనీసం ఆడపిల్ల పెళ్లి డబ్బుల జోలికి పోవద్దు అనే సోయి కూడా లేదా..? ఇది వినడానికే అసహ్యంగా ఉంది! అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కేంద్రం నిధులిస్తోంది..మోడీ ఫోటో పెట్టాల్సిందే

మొదటిపేజీ తరువాయి

కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నానని అన్నారు. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు' అని బండి సంజయ్ దుయ్యబట్టారు.

రేవంత్‌కు గురువు కేసీఆరేనని బండి సంజయ్ అన్నారు. 'రేవంత్‌కు కేసీఆరే గురువు. కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ అదే చేస్తున్నారు. రేవంత్ పనిలో కొత్తదనం ఏమీ లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయింది? కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదు? రేపే అరెస్ట్ అని ఇంకా ఎన్ని రోజులు అంటారు? ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? గ్రీన్ కో కంపెనీ నుంచి కాంగ్రెస్‌కు డబ్బులు ముట్టాయ్. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదు. శ్వేత పత్రం విడుదల చేయాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## తెలంగాణ హైకోర్టులో నలుగురు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

మొదటిపేజీ తరువాయి



ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు. 42 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన తెలంగాణ హైకోర్టులో ప్రస్తుతం 26 మంది సేవలందిస్తున్నారు. ఈ నలుగురి నియామకంతో ఆ సంఖ్య 30కి చేరింది.

## ప్రతి అవినీతి వెనకగా గంగుల హస్తం

మొదటిపేజీ తరువాయి

బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ నగర అభివృద్ధి జరిగిందని అన్నారు. అభివృద్ధి కోసమే తాను బిజెపిలో చేరానని అన్నారు. కరీంనగర్ అభివృద్ధిని గంగుల కమలాకర్ ఏనాడూ పట్టించుకోలేదు. డ్రైనేజీ నీళ్లు మళ్లించకుండా మానేరు రివర్ ఫ్రంట్ పేరిట నిధులు వృథా చేశారు. నగర అభివృద్ధి ఆగిపోవద్దని నేను ఇంతకాలం సైలెంట్‌గా ఉన్నా. చెక్‌డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోయాయి? చెక్‌డ్యామ్‌లు, రోడ్ల కాంట్రాక్టర్లంతా గంగుల బినామీలే. నాకు మేయర్ పదవి రాకుండా ఆనాడే అడ్డుపడ్డారు. కేవలం కేంద్ర నిధులతోనే నగర అభివృద్ధి జరిగింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేస్తాం. మరికొంత మంది కార్పొరేటర్లు భాజపాలో చేరుతారు' అని సునీల్‌రావు తెలిపారు.

# 'ఇందిరమ్మ' పేరు పెడితే ఇండ్లు ఇచ్చే ప్రసక్తే లేదు...

**- కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధాని ఫోటో కూడా ఉండాల్సిందే**
**- రేషన్ కార్డుపై ప్రధాని ఫోటో పెట్టకపోతే... రాష్ట్రానికి ఉచిత బియ్యం ఎందుకివ్వాలి?**
**- లేనిపక్షంలో నేరుగా పేదలందరికీ కేంద్రమే ఉచితంగా బియ్యం, ఇండ్లు ఇచ్చే విషయాన్ని ఆలోచిస్తాం...**
**- గత పదేళ్లలో దావోస్ పెట్టబడులపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా?**
**- ఈ ఫార్ములా రేస్ కేసులో కేటీఆర్ ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?**
**- ఎన్నికలెప్పుడొచ్చినా కరీంనగర్ కార్పొరేషన్ ఇగ బీజేపీదే...**
**- బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుండి నిధులు తెచ్చి కరీంనగర్ ప్రజలందరికీ ఉచితంగా నీళ్లందిస్తా...**
**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు...**
**- బండి సంజయ్ సమక్షంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, ఇద్దరు కార్పొరేటర్లు చేరిక**

**కరపత్రం కరీంనగర్:**



ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసే ఇండ్లకు 'ఇందిరమ్మ' పేరు పేడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రేషన్ బియ్యంపై ప్రధాని ఫోటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఇకపై కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధానమంత్రి కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉచిత బియ్యం ఎందుకు సరఫరా చేయాలని ప్రశ్నించారు. అవసరమైతే కేంద్రమే నేరుగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని స్పష్టం చేశారు. దావోస్ వేదికగా లక్షల కోట్ల రూపాయల పెట్టబడులపై ఎంఓయూలు జరిగాయంటూ జరుగుతున్న ప్రచారమంతా హంబక్ అని కొట్టిపారేశారు. గత పదేళ్లలో 5 లక్షల కోట్ల రూపాయలకుపైగా పెట్టబడులు రాబోతున్నాయని అవగాహన ఒప్పందాలు చేసుకున్నారని, ఆచరణలో మాత్రం పదో వంతు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. "రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... 2014 నుండి నేటి వరకు దావోస్ పెట్టుబడులకు సంబంధించి ఎంత మొత్తంలో ఎంఓయూలు జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలిస్తామన్నారు? ఆచరణలో ఎన్ని పెట్టబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలి" అని సవాల్ విసిరారు. శనివారం కరీంనగర్ లోని ఎస్ బీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ సునీల్ రావుతోపాటు ఇద్దరు కార్పొరేటర్లు, వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారందరినీ బీజేపీలో సాదరంగా ఆహ్వానిస్తూ బండి సంజయ్ కాషాయ కండువా కప్పారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంపై నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలు నమ్మి బీజేపీలో చేరుతున్న కరీంనగర్ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు స్వప్న, శ్రీదేవిలకు సాదర స్వాగతం. బీజేపీలో మీ చేరిక వందకు వంద శాతం ఉపయోగపడుతుంది. బీజేపీలో చేరుతామని చాలా మంది వస్తున్నారు... అయితే భూకబ్జాలకు పాల్పడే వారిని బీజేపీలో చేర్చుకోబోం. కరీంనగర్ అభివృద్ధికి నిధులు తెచ్చిందెవరో నిన్నటి కేంద్ర మంత్రి రాకతో ప్రజలకు తేటతెల్లమైంది. ఇకపై ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీదే అన్నారు. కేంద్రం నుండి నిధులు తెచ్చినా గత 10 ఏళ్లుగా ఏనాడూ బీఆర్ఎస్ నన్ను పిలవలేదన్నారు. స్మార్ట్ సిటీ పైసలు రాకుండా నేను కొట్లాడి తెస్తే... నన్ను పిలవకుండా బీఆర్ఎస్ నేతలు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే నేను కొట్లాడితేనే ఆ నిధులను కేసీఆర్ మంజూరు చేశారు. ఇంత కష్టపడ్డా...నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా ఇబ్బంది పెట్టారన్నారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులవల్లే కరీంనగర్ లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు నిన్నటి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ మీటింగ్ తో అర్ధమైందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయాయన్నారు. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ నడుస్తోందని విమర్శించారు. కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి నడుస్తున్నారని, రేవంత్ రెడ్డి గురువు కేసీఆరే అని, అందుకే ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, డ్రగ్స్, ఫాంహౌజ్ సహా స్కాంలన్నీ మరుగునపడ్డాయని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ రేపే అరెస్ట్ అంటూ.... నెల రోజులు ఊదరగొట్టి ఏం సాధించారని ప్రశ్నించారు. కేటీఆర్ అరెస్ట్ కు అన్ని ఆధారాలున్నాయని సీఎం చెప్పిన తరువాత కూడా ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?. కేసీఆర్ ఢిల్లీలో కప్పం కట్టగానే ఈఫార్ములా కేసును అటకెక్కించారు. గ్రీన్ కో వంటి సంస్థలను భయపెట్టడంవల్ల ఏం లాభం?. గ్రీన్ కో సంస్థ నుండి కాంగ్రెస్ పార్టీకి చందాల రూపంలో పైసలు ముట్టాయి. పార్టీ చందాల పేరుతో పైసలు తీసుకుని మళ్లీ ఆ సంస్థనే ఇబ్బంది పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని అడిగారు. ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నరని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందక చస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం సందించకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే కేంద్రం నిధులే కారణమన్నారు. కేంద్రం నిధులిస్తే... దొబ్బిపోతున్న పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే... కేంద్రం నుండే నిధులు తెచ్చి కార్పొరేషన్ ప్రజలందరికీ 24 గంటలపాటు నీళ్లందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధ శిఖామణి యనమనగాండ్ల (మేదరి) రాములు మృతి తీరని లోటు

**-మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి**





**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 25 .**

కల్వచర్ల గ్రామ శతాధిక వృద్ధ శిఖామణి యనమనగాండ్ల (మేదరి) రాములు (106) శు క్రవారం రాత్రి సుమారు 7.30 గంటలకు కాలం చేశారు అన్న విషయాన్ని తెలుసుకొని మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి వెళ్లి నివాళులు అర్పించి కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఊరిలో వారి సేవలు అమోఘం. వారి జీవితం నుండి చాలా నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి, వారికి దేవుని పట్ల భక్తి భావం, రామాయణ, మహాభారత, భాగవతం, సంబంధించిన విషయాలలో, మన సంప్రదాయాల విషయంలో, జానపద పాటలలో వారికున్న జ్ఞానం అమోఘం. వారి జీవితం అందరికీ ఆదర్శంగా ఉంటుందని. వారి కుటుంబానికి ఆయన లోటు ఎవరు తీర్చలేరని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేము కనకయ్య వార్డు సభ్యుడు బుస బాపన్న, తదితరులు ఉన్నారు.

# డా. సర్వేపల్లి విగ్రహం ఏర్పాటు చేయండి

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

పి.ఆర్.టి.యు.టి.ఎస్ జగిత్యాల జిల్లా నాయకులు నిన్న జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారిని కలిసి భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహ ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ వినతి పత్రం అందజేసారు. తత్వవేత్త, రాజకీయవేత్త, ఉపాద్యాయుడు గా పేరుగడించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారు భారత మొదటి ఉప రాష్ట్రపతి నుండి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి విగ్రహాన్ని జగిత్యాల లోని టీచర్స్ భవన్ ఆవరణలో



ఏర్పాటు చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షడు బోయిని పెల్లి ఆనంద్ రావు, కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డి ఇతర యూనియన్ సభ్యులతో కలిసి జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏవిఎన్ రాజు, వి.జమున, రాష్ట్రకార్యదర్శి ప్రభాకర్, మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, జగిత్యాల మండల అధ్యక్ష కార్యదర్శులు విద్యాదేవి, పద్మ హరీష్, ప్రవీణ్, తరుణ్ పాల్గొన్నారు. సర్వేపల్లి విగ్రహ ఏర్పాటు ఉత్తమమైన ఆలోచన అని ఉపాద్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో అందరూ పాలుపంచుకోవాలని, సహాయ సహకారాలు అందించాలని పి.ఆర్.టి.యు.టి.ఎస్ కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా ప్రజలందరినీ కోరారు.

## అధైర్యపడవద్దు మళ్లీ అందరిని గెలిపించుకునే బాధ్యత నాది




**- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 25...**

ఐడియా పడవద్దని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కౌన్సిలర్లను మళ్లీ గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గ పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.......గత ఐదు సంవత్సరాల్లో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ప్రజలకు అభివృద్ధి పనులు అందించారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత కూడా ప్రజల సమస్యలపై పోరాడుతూ, సంబంధాలను కొనసాగించాలంటూ కౌన్సిలర్లకు సూచించారు.

ప్రజా సమస్యలపై ఎప్పుడూ స్పందిస్తాను ఎమ్మెల్యేగా తనను గెలిపించడానికి కృషి చేసిన కౌన్సిలర్లను మళ్లీ గెలిపించుకోవడం తన బాధ్యత అని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చే ప్రజా సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. రాబోయే ఎన్నికల వరకు ప్రజల మధ్యలోనే ఉంటూ, వారి అవసరాలను తీర్చడంలో తాను కీలక పాత్ర పోషిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంబంధిత సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ

**- విద్యరత్న అవార్డు గ్రహీత కళాధర్ రెడ్డికి సన్మానం.**

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 25.**

లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈరోజు కల్వచర్ల లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొలుమురి శ్రీనివాస్ మరియు మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశంలో మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. భారతదేశం యొక్క అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక నాయకులు, దేశ భక్తుడు, మాటలతో మంత్రముగ్ధులను చెయ్యగలిగే గొప్ప వక్త. బ్రతికింది కేవలం 39 సంవత్సరాలే కానీ మరొక 1000 సంవత్సరాలు గడిచిన కూడా చెరిగిపోని ముద్ర వేశారు. అలాంటి మహనీయుడి గురించి నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థికి దానికి సహకారం అందించిన పిల్లల తల్లిదండ్రులకు, పాఠశాల యజమాన్యానికి ప్రతి ఒక్కరికి లయన్స్ క్లబ్ తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు అనంతరం ఇటీవల బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా విద్యారత్న అవార్డు అందుకున్న విద్య సంస్థ నడిపి ఎంతోమంది పిల్లలకు భవిష్యత్తును ఇచ్చిన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు కళాధర్ రెడ్డి కి రావడం సంతోషకరమని తెలుపుతూ స్కూల్ యాజమాన్యంతో కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి డాక్టర్ శరణ్య మారుతి యాదవ్, ప్రెసిడెంట్ ఆలస్కులు యజమాన్యం శ్రీనివాస్, అనిల్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్.జీ -3, ఏ.పి.ఏ ఏరియాల ఉత్తమ ఉద్యోగులు వీరే

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 25**



THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
RAMAGUNDAM-3 & ADRIYALA PROJECT AREA
Details of Best Workmen from RG-3 and APA to be honoured on the eve of Republic Day 26.01.2025

Best Singarenian (Central Function) — Sri Darandi Thirupathi Rao, EC No. 947587, Head Overman, OC-1, RG-3
Best Singarenian (Central Function) — Sri Mekala Ramesh, EC No. 2914158, SDL/LHD Operator, ALP, APA
Best Officer (Central Function) — Sri T Nageswara Rao, EC No. 2647808, Supdg.Engineer(SMMC), OC-2, RG-3
Best Officer (Central Function) — Sri Sreekanth Kannepogu, EC No. 51865, Dy.Supdg.Engr(E&M), ALP, APA
Best Workman — Sri Akunuri Suman, EC No. 139095, Fitter, ALP, APA
Best Workman — Sri Mahmad Azeed, EC No. 1600324, Multi Job Worker, ALP, APA
Best Workman — Sri Pabbathi Raji Reddy, EC No. 1240742, EP Operator, OC-1, RG-3
Best Workman — Sri BURRA RAJU, EC No. 139126, Foreman (Mec/Aut)-DH, OC-1, RG-3 Area
Best Workman — Sri Kondapalli Kishan, EC No. 2111815, Conveyor Operator, OC-1 CHP, RG-3 Area
Best Workman — Sri Kathula Raju, EC No. 133730, Foreman (Mec/Aut)-DH, OC-2, RG-3
Best Workman — Sri Satram Sammaiah, EC No. 881626, General Mazdoor(HEMM), OC-2, RG-3

76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం జరిగిందని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రామగుండం-3 ఏరియా నుండి ఉత్తమ అధికారిగా ఓ.సి-2 లో సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న టి.నాగేశ్వరరావు, ఉత్తమ సింగరేణియన్ గా ఓ.సి -1 లో హెడ్ ఓవర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న డి.తిరుపతిరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుండి ఉత్తమ అధికారిగా డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీకాంత్, ఉత్తమ సింగరేణియన్ గా ఎస్.డి.ఎల్. ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న మేకల రమేష్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో జరిగే ప్రధాన వేడుకల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతుల మీదుగా సన్మానిస్తారని తెలిపారు. అదే విధంగా రామగుండం -3 ఏరియా నుండి ఉత్తమ ఉద్యోగులుగా ఓ.సి-1 లో ఇ.పి.ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న పి.రాజిరెడ్డి, ఫోర్ మెన్ (మెకానికల్ ) గా విధులు నిర్వహిస్తున్న బుర్ర రాజు, సి.హెచ్.పి. లో కన్వేయర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న కె.కిషన్, ఓ.సి-2 లో జనరల్ మజ్దూర్(హెమ్) గా విధులు నిర్వహిస్తున్న సత్రం సమ్మయ్య, ఫోర్ మెన్ (మెకానికల్) గా విధులు నిర్వహిస్తున్న కత్తుల రాజు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుండి ఫిట్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఆకునూరి సుమన్, మల్టీ జాబ్ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్న మొహమ్మద్ అజీద్ ఎంపికయ్యారని, వీరిని స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు నిర్వహించనున్న ఏరియా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రతి జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే అండగా ఉంటుంది



– టీయూడబ్ల్యూజే నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు పోలగోని లక్ష్మీకాంత్

**కరపత్రం ప్రతినిది జనవరి 25)**

ప్రతి జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని టీయూడబ్ల్యూజే నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు పోలగోని లక్ష్మీకాంత్ అన్నారు.ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మునుగోడు మండల కేంద్రంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న చండూరు మండల నమస్తే తెలంగాణ విలేకరి వరికుప్పల సురేష్ ను టీయూడబ్ల్యూజే 143 జిల్లా కమిటీ సూచన మేరకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలగొని లక్ష్మీకాంత్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పండ్లు,బ్రెడ్ ప్యాకెట్ ను సురేష్ కు అందజేసి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి జర్నలిస్టు కు సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే 143 సంఘం మండల నాయకులు కోడి రాములు, మేడి అశోక్,దుబ్బ అనిల్, జిట్టగోని వెంకటేష్ పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినం ప్రకటించాలనీ

## కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారిని కలిసి వినతి పత్రం అందజేసిన బంజారా సేవాలాల్ సంఘ నాయకులు

**( కరపత్రం ప్రతినిధి జనవరి25)**

కరీంనగర్ కేంద్రంలో బంజారా సేవాలాల్ సంఘ నాయకులు కలిసి సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినం ప్రకటించాలని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారిని కలవడం జరిగింది వారు సానుకూలంగా స్పందించి సంఘ నాయకులకు అభినందించారు చాలా మంచి కార్యక్రమం ఎంచుకోవడం జరిగింది నేను కూడా ప్రధానమంత్రి గారితో హెూంశాఖ మంత్రి గారితో మాట్లాడి సెలవు దినం ప్రకటించే విధంగా కృషి చేస్తానని తెలపడం జరిగింది అందుకు సంఘ నాయకులు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గారికి హృదయపూర్వక



ధన్యవాదాలు తెలుప్యారు ఎన్నో రోజుల నుంచి సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినం ప్రకటించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించనైనది కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు కూడా సెలవు దినం ప్రకటించలేదు కావున ఎన్డీఏ ప్రభుత్వం బంజారాల ఆరాధ్య దైవం సేవలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినం ప్రకటించాలని ప్రకటించి యావత్ భారత దేశంలో ఉన్నటువంటి 15 కోట్ల పై చిలుక జనాభాలా యొక్క దృష్టిలో ఉంచుకొని వారికి ఫిబ్రవరి 15న సేలువదినం ప్రకటించాలని తెలపడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘ మెదక్ జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్ బిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్ సింగ్ నాయక్ నాయక్ రాజు నాయక్ శభాష్ జాదవ్ రెడ్యా నాయక్ మోహన్ నాయక్ శ్రీనివాస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు

# కురుమ సంఘం అధ్యక్షుడిగా కుండే సత్తయ్య ఎన్నిక

**కరపత్రం గట్టుప్పల.ప్రతినిది జనవరి25)**



గట్టుపల మండల కేంద్రం లో కురుమ సంఘం ఎన్నికలు నిర్వహించారు ఎన్నికల్లో కుండే సత్తయ్య తన సమీప అభ్యర్థి కుండే వెంకటేష్ మీద 11ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.గెలుపొందిన కుండె సత్తయ్యను పలువురు ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు కుండే సత్తయ్య మాట్లాడుతూ కురుమ సంఘం అభివృద్ధికి, కురుమలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా కుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# ఘనంగా 75వ ఓటరు దినోత్సవం

**గజ్వేల్ జనవరి 25, కరపత్రం**

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ,& పీజీ కళాశాల ( అటానమస్ ) లోని రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో 75 వ ఓటర్ దినోత్సవము ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ న నిక్కత్ అంజుమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను మన దేశం కలిగి ఉందన్నారు. నేటికీ ఎలక్షన్ కమిషన్ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రపంచంలోని అగ్ర రాజ్యాలు కూడా ప్రజాస్వామ్య వ్యవస్థని దిగ్విజయంగా కొనసాగించడంలో ఆటుపోట్లు ఎదురయ్యాయి అన్నారు. మన దేశం మాత్రం ప్రపంచంలోనే దాదాపు 100 కోట్ల ఓట్లను కలిగి ఉండి కూడా ప్రజాస్వామ్య వ్యవస్థను విజయవంతంగా కొనసాగించడం మనందరికీ గర్వకారణమని అని అన్నారు.




అమెరికా, యూరోపియన్ దేశాల లాంటివి కూడా నేటికీ సాంప్రదాయ పద్ధతి అయిన బ్యాలెట్ పద్ధతిని ఉపయోగిస్తున్నాయన్నారు. మన దేశం మాత్రం ఓట్లను వేస్తుండడం నిజంగా చాలా గొప్ప విషయం అన్నారు. పలు సందర్భంలో నియంతలూగా మారిన ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను ఓటు అనే ఆయుధంతో తొలగించి ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును నేటి యువత బాధ్యతాయుతంగా కుల, మత, ప్రాంత, భాష, మద్యం, డబ్బు, రాగద్వేశాలకతీతంగా వినియోగించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులచే ఓటర్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు, ఐ. కూ. ఏ.సి కోఆర్డినేటర్ వెంకటేష్, ఎన్. సి. సి కోఆర్డినేటర్ డా. మహేందర్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్స్ డా. మహేందర్, డా. రామచంద్రం, డా. పెద్దిరాజు, డా. అలివేలు, డా. కవిత, వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసయ్య, నరేష్, శివ, మార్కండేయ, శ్రీధర్, చాంద్, సాయి రమేష్ విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్, ఎన్. సి. సి క్యాండిడేట్స్ తదితరులు పాల్గొన్నారు.

# అమీన్ పూర్ లో సైబర్ సెక్యూరిటీ అవగాహన ,ట్రాఫిక్ క్రమబద్ధీకరణ దొంగతనాల నివారణలపై అవగాహన సదస్సు చేపట్టారు.




**(కరపత్రం సంగారెడ్డి ఉమ్మడి బ్యూరో జనవరి25)**

సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ రవీందర్ రెడ్డి పాల్గొని ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ యువతరం డ్రగ్స్ వైపు వెళ్లకుండా తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. మైనర్ లకు మోటార్ వాహనాలు ఇవ్వొద్దు, ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు అధికమవుతున్నాయి, అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, బాగా చదువుకున్న వాళ్లే అధికంగా మోసపోతున్నారన్నారు. కోవిడ్ తరువాత ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, పాసీవ్ ఇన్ కం వంటి కాన్సెప్ట్ వచ్చాయని, ట్రేడింగ్ యాప్ లతో చాలామంది మోసపోతున్నారని చెప్పారు. డబ్బులు ఊరికే రావు, పైసలపై ఉన్న ఆశను ఎరగా వేసి సైబర్ నేరగాళ్లు సాఫ్ట్వేర్ ఉద్యోగులను లక్ష్యంగా వలవేస్తున్నారన్నారుడిజిటల్ అరెస్టు అనేది ఉండదు.అజ్ఞాతవ్యక్తులు ఫోన్లు చేసి భయపెడితే పోలీసులను సంప్రదించాలన్నారు.

# ఎవరూ ఆందోళన చెందవద్దు అర్హులందరికీ అన్ని పథకాలు అందుతాయి

**– గ్రామ సభలలో వార్డు సభలలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అందజేస్తారు–**

**– కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షులు బయ్యారం మల్లారెడ్డి–**

**గజ్వేల్ జనవరి 25,కరపత్రం**

సంక్షేమ పథకాలకోసం ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికి అన్ని పథకాలు ప్రభుత్వం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షులు బయ్యారం మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన గజ్వేల్ లో విలేఖరులతో మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు గ్రామసభలలో, వార్డుసభలలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అధికారులు పథకాలను అందిస్తారని మల్లారెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో పారదర్శకత పాటించి అర్హులను ఎంపిక చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామసభలలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు బురద జల్లాలని చూశారని, కానీ వారి ఆశలు ఫలించలేదని



పేర్కొన్నారు. గ్రామ సభలను వార్డు సభలను అడ్డుకునేందుకు బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ప్రయత్నించారని, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి ప్రయత్నాలను తిప్పికొడితే తోకలుముడిచి పారిపోయారని తెలిపారు. ప్రజలు వారి మాటలను నమ్మక పథకాలకు దరఖాస్తు చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. గ్రామ సభలకు వార్డు సభలకు సహకరించిన అధికారులు పోలీసులు సిబ్బందికి మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ సభలలో వార్డు సభలలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఆహార భద్రత కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అందజేస్తామని అన్నారు. ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని ఎవరు కూడా ఆందోళన పడవద్దని అన్నారు. పది సంవత్సరాలలో కేసీఆర్ పాలనలో ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఒకటి కూడా తీసుకు రాలేదని అన్నారు. రైతుబంధు పేరిట వ్యవసాయం చేయకుండా ఉన్నవారికి డబ్బులు ఇచ్చి రాష్ట్ర ఖాజనాను కొల్లగొట్టారని అన్నారు. పెద్దపెద్ద భూస్వాములకు, బడా వ్యాపారస్తులకు, బడా నాయకులకు రాష్ట్ర ప్రజల సొమ్మును దోచిపెట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఇంత మంచి పథకాలు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు వార్డు సభలు నిర్వహిస్తే వాటిని అడ్డుకునేందుకు బిఆర్ఎస్ నాయకులు గొడవలకు, ఘర్షణలకు, దాడులకు తెరలేపారని ఆరోపించారు. వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వారిని నమ్మలేదని స్వచ్ఛందంగా వచ్చి అర్హులుగా గుర్తించి తమకు పథకాలు అందజేయాలని దరఖాస్తు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులు ఇలాగే సహకరించి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామ వార్డు సభలను విజయవంతం చేసిన అధికారులకు, పోలీసు సిబ్బందికి ప్రజలకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకం లో దివ్యంగులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము

**(కరపత్రం సంగారెడ్డి జిల్లా స్టాపర్ జనవరి25)**



ఓ ఎం ఎస్ నెంబర్ 1 2018 ప్రకారం 5% ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని దివ్యంగుల జె ఏ సి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏ ఓ కి వినతి.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లో దివ్యంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కేటయించి లబ్ధిదారుల ఎంపిక చేయాలని కోరుతూ జిల్లా దివ్యంగుల జె ఏ సి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏవో పరమేష్ కి వినతిపత్రం ఇచ్చిన దివ్యంగు ల జె ఏ సి కన్వీనర్ అమిదిపురం మహేష్ కుమార్,ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర లు ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2018 లో ప్రభుత్వం జారీ చేసిన జి ఓ ఎం ఎస్ నెంబర్ 1 ప్రకారం దివ్యంగుల కు ప్రభుత్వము అమలు చేసే అభివృద్ధి, మరియు సంక్షేమ పథకల్లో ఐదు శాతం రిజర్వేషన్ లు కల్పించాలని స్పష్టంగా ఉందని,ఇట్టి జి ఓ ప్రకారం జిల్లాలో ని దివ్యంగులకు ఇందిరమ్మ ఇండ్లలో ఐదుశాతం ఇండ్లు కేటాయించి లబ్ధిదారుల ఎంపిక చేయాలని దానికి జిల్లాలోని ఎం పి డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ ల కు జిల్లా కలెక్టర్ తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదే విదంగా అంత్యోదయ రేషన్ కార్డు లలో కూడా దివ్యంగులకు ప్రాధాన్యం ఇచ్చి, దివ్యంగులకు రాజ్యాంగం కల్పించిన చట్ట బద్ద హక్కులు కాపాడాలని కోరారు. ఇట్టి కార్యక్రమం లో దివ్యంగుల జె ఏ సి నాయకులు శేగ్గరి వెంకటేష్, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాగా చదువుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి

**(కరపత్రం సిద్ధిపేట జిల్లా ఉమ్మడి బ్యూరో జనవరి25)**

ఉన్నతంగా ఎక్కడికి వెళ్ళినా సిద్దిపేట కీర్తి ప్రతిష్టలు పెంచాలి ఇచ్చిన మాట ప్రకారం 10,000 రూపాయలు ఎన్.సీ.సీ విద్యార్థులకు అందజేత రాష్ట్ర ప్రభుత్వం నుండి మీకు సహకారం అందేలా కృషి చేస్తాసిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ విద్యార్థులు బాగా చదువుకొని కని పెంచిన తల్లిదండ్రులకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చేలా కృషిచేసి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలో భాగంగా డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్.సీ.సీ విద్యార్థులు పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా కాలేజీ తరఫున పరేడ్ ఉంటుందని అందుకు కావలసిన పరికరాలు కావాలని కోరారు. ఈ సందర్భంగా పరేడ్ కు కావలసిన పరికరాలు ఇతర వాటి కోసం 10,000 రూపాయలు ఇస్తానని అత్తు ఇమామ్ మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ శనివారం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కి వెళ్లి ఎన్ సి సి విద్యార్థులకు 10,000 రూపాయల క్యాష్ ను అందజేశారు. ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని అన్నారు. ఉన్నతంగా రాణించి అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్న వాటిని ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే వెనక్కి వెళ్ళదని కచ్చితంగా విద్యార్థులకు అండగా ఉంటామని అన్నారు. బాగా చదువుకొని ఎక్కడికి వెళ్లినా సిద్ధిపేట కీర్తి ప్రతిష్టలు పెంచేలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు యువజన పట్టణ అధ్యక్షులు గయ్యాజుద్దీన్. నజ్జూ. ఫయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

